క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

నగరి: నియోజకవర్గంలో బుధవారం పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కేరోజా పాల్గొననున్నారు. నగరి, పుత్తూరులో గంగజాతరను పురస్కరించుకుని ఉదయం 10.30 గంటలకు నగరిలో, ఆ తర్వాత పుత్తూరులో అమ్మవారికి సారె సమర్పిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు నగరి మండలం దామరపాకంలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆమె ప్రారంభిస్తారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కార్వేటినగరం: ముక్కరవానిపల్లిలో బుధవారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి పాల్గొంటారని మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు తెలిపారు. ముక్కరవానిపల్లి, ముక్కరవానిపల్లి ఏఎ డబ్ల్యూ, దాసరినత్తం, గంగమాంబపురం, దళితవాడ, కత్తెరపల్లి, దళితవాడ, ఆదిఆంధ్రవాడ, బీసీ కాలనీ, కొత్తరాజు ఇండ్లలో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'జగనన్నకు చెబుదాం' రద్దు

పుత్తూరు రూరల్: పుత్తూరులో బుధవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు కమిషనర్ కెఎల్‌ఎన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి కార్యక్రమాన్ని ఎప్పుడు నిర్వహిస్తారో త్వరలోనే తెలియజేస్తామన్నారు.

రాగి జావతో ఆరోగ్యం



రాగి జావను పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇస్తున్న రాగి జావతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆముదాల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇస్తున్న రాగిజావను రుచి చూసి, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తిన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

నగరి : మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడలో సారా విక్రయిస్తున్న కన్నియప్పన్ (46), పంచాక్షరం (42)ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు మంగళవారం ఆమె తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. వారిద్దరి నుంచి 5 లీటర్ల చొప్పున సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. తనిఖీలో ఎస్‌ఐ భానుప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ బాలమురి, మోహన్‌రెడ్డి, విజయకుమార్, సతీష్, పీసీలు కార్తికేయన్, గురవయ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

నింద్ర: మండలంలోని జగన్నన కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు కోరారు. మంగళవారం ఆయన మండలంలోని ఇరుగువాయి, నింద్రలో జగన్నన కాలనీ నిర్మాణాలను పరిశీలించారు.

గీతా సారాంశమే మానవాళికి ముక్తి

బంగారుపాళెం: గీతాసారాంశమే మానవాళికి ముక్తి మార్గమని ప్రబోధానంద భక్తులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఇందూ జ్ఞానవేదిక, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, గీతా పారాయణం చేపట్టారు. మంగళవారం సాయంత్రం శ్రీకృష్ణ భగవానుని ప్రతిమను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిపై కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి స్వామిని దర్శించుకున్నారు. ఊరేగింపులో గోపికల వేషధారణలో చిన్నారులు వేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ప్రబోధసేవా సమితి నిర్వాహకులు బాలాజి, ధనుంజయ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

బంగారుపాళెం: గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల కోసం ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్ తెలిపారు. కీరమంద గ్రామంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్‌ఎం భారతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి ఊరేగింపు



ఊరేగింపులో బేతాళ నృత్యం



గంగమ్మా! దీవించమ్మా..



ప్రజలకు గంగజాతర శుభాకాంక్షలు చెబుతూ మంత్రి రోజా ఏర్పాటు చేసిన ఆర్చి



దేశమ్మ ఆలయంలో పొంగళ్లు పెడుతున్న మహిళలు

నగరి : నగరి జాతరకు ఎంతో పేరుంది. ఈ జాతరతో పాటు పరిసర 72 గ్రామాల్లో జాతర నిర్వహించడంతో ప్రత్యేకత సంతరించుకుంది. మంగళవారం ఉదయం నుంచే గంగమ్మ కొలువుదీరే ప్రాంతంలోను, దేశమ్మ, ఓరుగుంటాలమ్మ ఆలయాల వద్ద మహిళలు భారీ సంఖ్యలో పొంగళ్లు పెట్టారు. ఇప్పటికే గంగమ్మ దర్శనానికి భక్తుల రద్దీని నియంత్రించడానికి ప్రత్యేక క్యూలను ఏర్పాటుచేశారు. జాతర మొక్కుబడులలో ప్రధానమైన వెయ్యికన్నుల దుత్త, అగ్గిసట్టి విక్రయాలు ఊపందుకున్నాయి. వేపాకు సారెను సమర్పించేందుకు యువకులు వేపాకురెమ్మల సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రధాన రహదారి పొడవునా విద్యుత్ దీపాల కాంతులు జాతరకు అదనపు శోభనిస్తున్నాయి. జాతరలో చిన్నారులను ఆకట్టుకునే భారీ రంగుల రాట్నాలు ఏర్పాటయ్యాయి. జాతరను పురస్కరించుకుని టీటీడీ ఈ ఏడాది తొలిసారి ఆలయం వద్ద భారీఎత్తున చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం, అలాగే అలంకరణకు వందకేజీల పుష్పాలను ఇవ్వడం విశేషం! ప్రధాన మార్గాల కూడళ్ల వద్ద మంత్రి ఆర్కేరోజా జాతర శుభాకాంక్షలు తెలుపుతూ ఆర్చిలు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణలు కొత్త శోభను ఇచ్చాయి.



ఆలయ ప్రాంతంలో టీటీడీ ఏర్పాటు చేసిన చలువపందిరి





ఆకట్టుకుంటున్న దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు

ఈ ఏడాది పూజలు గంగమ్మకు మాత్రమే

నగరి గంగ జాతరకు చారిత్రక విశిష్టత ఉంది. ప్రతి గ్రామంలో ఉండే గ్రామదేవతకు ఏడాదికి ఒకసారి జాతర చేస్తుంటారు. నగరి పట్టణ గ్రామదేవతల్లో అక్కచెల్లెళ్లైన ఓరుగుంటాలమ్మ, దేశమ్మ, గంగమ్మ ఊరి మధ్య జాతర ప్రాంతంలో కొలువుదీరుతారు. చారిత్రక కథనం మేరకు గంగమ్మకు పెద్దక్క ఓరుగుంటాలమ్మ, చిన్నక్క దేశమ్మ. ఊరికి పడమర ఓరుగుంటాపురంలో ఓరుగుంటాలమ్మ, తూర్పున టీఆర్ కండ్రిగలో దేశమ్మ కొలువుదీరి రక్షిస్తుంటారని, ఉగ్రరూపిణి అయిన గంగమ్మ ఏడాదికోసారి జాతరలో ఊరి మధ్యలో కొలువుదీరి, దుష్టశక్తులను సంహరిస్తుందని భక్తుల విశ్వాసం. గంగమ్మకు రోజూ నైవేద్యం సమర్పించడానికి వీలుకాదని, అందుకే ఏడాదికోసారి ఊరి మధ్యలోకి తీసుకువచ్చి, కుంభాలకూడు పెట్టి, సంతృప్తిగా పొలిమేర దాటిస్తారని.. చెల్లెలికి స్వాగతం పలకడానికి అక్కలైన ఓరుగుంటాలమ్మ, దేశమ్మ జాతర ప్రాంతానికి వస్తారని ఇక్కడి ప్రజల నమ్మకం. అయితే ఈ ఏడా ది గ్రామదేవత దేశమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తుండడంతో కుంభాభిషేకం అనంతరమే అమ్మవారిని ఆలయం నుంచి తీసుకురావలసి ఉంటుంది. దీంతో గ్రామదేవతలు జాతర ప్రాంతానికి చేరుకోలేదు. జాతర ప్రాంతంలో గంగమ్మ మాత్ర మే ఈ ఏడాది పూజలు అందుకోనుంది.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కార్వేటినగరం: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని త్యాగరాజపిళ్లై వీధికి రూ.8లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. బాలాజి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు అధిక నిధులు వెచ్చిస్తోందని గుర్తు చేశారు. ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే కాకుండా, గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఈక్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి మండల మహిళా అధ్యక్షురాలు గిరిజ చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు జే. జేలురెడ్డి, వరాలురెడ్డి, ధనశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కేశవులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఘనంగా పవిత్రోత్సవం



పవిత్రోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

నగరి: మండలంలో బుగ్గ అగ్రహారంలోని అన్నపూర్ణ సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ఆలయంలో విఘ్నేశ్వర పూజ, హోమం, గ్రంధిపూజ, గ్రంధి సమర్పణ పూజలు, శాంతి హోమం, రుద్ర హోమం చేశారు. స్నపన తిరుమంజనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.పార్థసారథి, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఐరాల ఉపాధ్యాయుడు

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బయాలజీ అసిస్టెంట్ సుబ్రమణ్యం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు సోమవారం హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ, ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 9, 11వ తేదీల్లో విజయవాడలో నిర్వహించారన్నారు. సుబ్రమణ్యం కబడ్డీ, యోగా పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన్ను సత్కరించారు. పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, పీడీ దేవ పాల్గొన్నారు.



సుబ్రమణ్యంకు సన్మానం

జాతర బందోబస్తును పరిశీలించిన అడిషనల్ ఎస్పీ



గంగమ్మ కొలువుదీరే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

నగరి: గంగ జాతరకు ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును అడిషనల్ ఎస్పీ సుధాకర్ మంగళవారం రాత్రి పరిశీలించారు. గంగమ్మ కొలువుదీరే ప్రాంతంలో ఏర్పాట్లను, గంగమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చే, తరలించే మార్గాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తును ఆయన పరిశీలించారు. ఆయన వెంట నగరి, నగరి రూరల్ సీఐలు సురేష్, శ్రీనివాసంతి పాల్గొన్నారు.

అత్తూరులో క్షేత్ర దినోత్సవం

నింద్ర: మండలంలోని అత్తూరులో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం (తిరుపతి) క్షేత్ర దినోత్సవం నిర్వహించింది. సజ్జ పంటలను పరిశీలించి శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడారు. జూన్‌లో 40మంది రైతులకు ఎన్‌బివి-04 సజ్జ రకం విత్తనాలు పంపిణీ చేశామని, వారు సాగు చేయడంతో ఇప్పుడా పంట కంకి దశలో ఉందన్నారు. ఈ రకం విత్తనం పూర్తి స్థాయిలో మొలక వస్తుందని, ఎక్కువ పిలకలతో అధిక దిగుబడినిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పాడి రైతులకు మినరల్ మిక్సర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త అనూష, దివ్య, వ్యవసాయ సహాయకులు ప్రభావతి, రైతులు పాల్గొన్నారు.



పాడి రైతులకు మినరల్ మిక్సర్ పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త

భక్తిశ్రద్ధలతో చాటుబండి



గెరిగ ఊరేగింపు

పుత్తూరు రూరల్: గ్రామ దేవత గంగమ్మ జాతర చాటుబండి కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్థానిక శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయం నుంచి గెరిగ ఊరేగింపు ప్రారంభమైంది. రాత్రి 8 గంటలకు బజారు వీధిలోని గంగమ్మ ఆలయం నుంచి నిర్వాహకులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బయలు దేరి కాపువీధిలోని కేశావాచ్చారి కుటుంబం వారు తయారు చేసిన చాటుబండికి పూజలు చేశారు. అక్కడ నుంచి చాటుబండిని మండపం వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. అక్కడ నుంచి ఊరేగింపుగా ఆరేటమ్మ ఆలయం వద్దకు వెళ్లి పసుపు కుంకుమను సమర్పించారు. దివిలి వెంకట్రాయులు మందడి కుటుంబం చాటుబండి బలిదానం ఇచ్చింది. అక్కడ నుండి కుమ్మరి కన్నయ్య ఇంటికి వెళ్లి గంగపెట్టెను ఊరేగింపు మండపం వద్దకు తీసుకొచ్చి, అన్నంతో దీపం వెలిగించి, పూజలు చేశారు. అనంతరం చాటుబండిని మంగళ వాయిద్యాలు, బాణసంచా నడుమ కాపువీధి, బజారువీధి, నగరం రోడ్డు, అమ్మోరుగుంట వీధుల్లో ఊరేగించారు. బజారు వీధిలోని నాలుగు వీధుల కూడలి వద్ద చలువ పందిళ్లు, వాటికి వస్త్రాలంకరణ, అమ్మవారి ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీప అలంకరణలు, ఇరువైపులా క్యూలైన్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వేపాకు తోరణాలు, అమ్మవారి ప్రతిమలతో కూడిన విద్యుత్ దీప కటౌట్లతో పట్టణం జాతర సందడి సంతరించుకొంది.





విద్యుత్ దీప కాంతుల్లో దేవతామూర్తులు

ఆరోగ్య సురక్ష విజయవంతం చేయండి



శిక్షణలో మాట్లాడుతున్న త్రిశూల్

కార్వేటినగరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి త్రిశూల్ అన్నారు. మంగళవాడం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు జగనన్న ఆరోగ్య సురక్షపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో త్రిశూల్ మాట్లాడుతూ ప్రతిఇంట్లో వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేను నిర్లక్ష్యం చేయకుండా 15 నుంచి 30వ తేదీ వరకు సర్వేను పూర్తిచేయాలని ఆదేశించారు. సర్వే అనంతరం అక్టోబర్ 1 నుంచి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడతామని, ప్రజలు కూడా సర్వేకు సహకరించాలని సూచించారు. ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నిర్వహించే సర్వేకు వలంటీర్లు విధిగా పాల్గొని రోగుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంఈఓ విజయకుమార్, వైద్యాధికారులు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు షామిని, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నాటుతున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతపై అందరిపై ఉందని తహసీల్దార్ బాబు తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో సర్పంచ్ గాలి మహేష్‌బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. చెట్లను విచ్చలవిడిగా నరికివేయడం వల్ల వాతావరణంలో కాలుష్యం పెరిగిపోయి మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఏఓ ఢిల్లీప్రసాద్, వీఆర్‌ఓ తంగరాజ్, ఫీల్డ్‌అసిస్టెంట్ లోకేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు



అంబలి తీసుకొస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని ఏటూకూరిపల్లెలో వెలసిన బాటగంగమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లు, అంబలి పెట్టి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం పాలబిందెలను మహిళలు గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



విజయపురం (నగరి): పన్నూరు ఉన్నత పాఠశాల నుంచి నింద్ర ఎంఈఓ-2గా ఉద్యోగోన్నతి పొందిన హెచ్‌ఎం శ్రీధర్‌రాజుతోపాటు ఉపాధ్యాయులు సుహాసిని, కవిత, ప్రసాద్, విజయనాయుడు, శ్రీనివాసులను శాలువలు, పూలమాలతో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. పాఠశాల అభివృద్ధికి వారు చేసిన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ల పంపిణీ



కొత్త పెన్షన్లు పొందిన లబ్ధిదారులతో సర్పంచ్ కుమార్

పుత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందుతున్నాయని రామసముద్రం సర్పంచ్ డి.కుమార్ అన్నారు. గ్రామంలో ఏడుగురికి కొత్తగా మంజూరైన పెన్షన్లను మంగళవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైనప్పటికీ సంక్షేమ పథకాలు అందనిపక్షంలో తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాల పెంపు



చెరువు గట్టుపై మొక్కలను పరిశీలిస్తున్న సూర్యకుమారి

ఐరాల: 'అమృత్ సరోవర్' పనులతో భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఏ.సూర్యకుమారి అన్నారు. మంగళవారం వడ్రంపల్లె గ్రామ పంచాయతీలోని మెట్టఇండ్ల వద్ద రూ.4.40 లక్షలతో చేస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కింద చెరువుల్లో ఇలాంటి పనులు చేస్తే వర్షపు నీరు చేరి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. అమృత్ సరోవర్ కింద చేపట్టిన కుంట లోతు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి చేపల పెంపకం, ప్లాంటేషన్ కింద కొబ్బరి మొక్కలు పెంచి, ఆర్థిక వనరులను పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సర్పంచ్ నరసింహారెడ్డి, దాతల సహకారంతో అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన మొక్కల పెంపకాన్ని చూసి సర్పంచ్‌ను అభినందించారు. జాయింట్ కమిషనర్ శివప్రసాద్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా డీఆర్‌డీఏ పీడీలు గంగాభవాని, తులసి, డీపీఓ లక్ష్మి, డీఎల్‌డీఓ రవికుమార్, పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీడీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రదోష పూజలు



విశేషాలంకరణలో నందీశ్వరుడు

నాగలాపురం: త్రయోదశి సందర్భంగా మండలంలోని సురుటుపల్లెలో ప్రసిద్ధ శ్రీసర్వమంగళా సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీనందీశ్వరస్వామి వారికి, శ్రీవాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు, పరివార దేవతలకు విశేష పూజలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ప్రదోష కాలంలో నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామికి ఏక కాలంలో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్లతో అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ మాజీ చైర్మన్ ఏవీఎం మునిశేఖర్ రెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఏవీఎం.బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.